# చిరుసంధ్యలో...

కొన్ని రోజులు మానసికంగా ఏకాంతాన్ని అనుభవించాను. ఇప్పుడు భౌతికంగా ఎవ్వరూ లేరు. ఈ యింట్లో నేనొక్కణ్ణే నాది ఏకాంతమా! ఒంటరితనమా! లేకపోతే రెండునా! ఏకాంతం అంటే అందర్ని దూరంగా పెట్టి మన గూట్లో ఉండడమా! అయితే ఏకాంతమే. నా చుట్టూ ఉన్న అందరితో నాకు సంబంధం లేకుండా రాజ్యం ఏనాడో చేసింది.

ఒంటరితనం అంటే అందరూ మనని వదిలేయడం. నిజమే, రాజ్యం చేసే పన్లక్కి, అనే మాటలకి భయపడి స్నేహితులు నాతో మాట్లాడ్డానికే జంకుతారు. అయితే ఒంటరి తనమే.

ఎంత విషాదం! నా వయసు అరవయి ఎనిమిది. నా తప్పిదాలకి నేనే జవాబుదారి. ఈ పదిహేను రోజుల్నించి నేను చేసుకుంటున్న విశ్లేషణలో నాకు ఇదే జవాబు దొరికింది. ఈ ఏకాంతం అంతా నాదే. నాకు మాటలు రావు అనేవాళ్ళు. చాలామంది. కానీ వచ్చు. అన్నీ ఏకాంతంలో నేర్చుకున్నాను. ఈ మధ్యలో మాట్లాడుతున్నాను.

నన్ను నేనే అన్వేషించుకుంటున్నానా! అది కూడా నాకు తెలీడం లేదు. నేను ఏ స్థితిలో ఉన్నానో తెలీని అయోమయం అప్పుడప్పుడు నన్నావహిస్తూంటుంది. అభద్రత, ఒంటరితనం, నిశ్శబ్దం.

గంభీరమైన ఏకాంతం.

ఎవర్ని ఒప్పించాల్సినది, నొప్పించాల్సిన పనిలేదు. కానీ, ఏదో బాధ, విషాదం.

కానీ, సత్తెన్నారాయణ సాయంతో పెరటి వసారాలోకి వెళ్ళాను.

యింకా పూర్తిగా తెల్లారలేదు. కొబ్బరాకులు, అరిటాకులు వీస్తున్న గాలికి పరపరలాడుతున్నాడు.

పెరటరుగు మీద ఓ పడక్కుర్చీలో నేను కూచున్నాను. ఎప్పుడూ కూచునే రాజ్యం కుర్చీ ఖాళీగా ఉంది. ఆ కుర్చీని ఆనుకున్నగోడ మీద రాజ్యలక్ష్మి ఫోటో ఉంది. దాన్ని ఫ్రేం కట్టించలేదు. కొంకాపల్లిలో శీనుపెట్టిన షాపులో లామినేట్ చేయించాను.

దళసరి అద్దాలున్న కళ్ళజోదుని పంచతో ఓసారి తుడిచి, మళ్ళా కళ్ళకి తగిలించి రాజ్యం ఫోటోవైపు చూసాను. చిరునవ్వు చెరగని నవ్వు. అదే నవ్వుతో నన్ను చూస్తోంది.

ఒక్కసారిగా నాలుగు కాకులు నూతిపళ్ళెం దగ్గర ఆ పక్కనే ఉన్న అరిటిచెట్టుమీద కూచుని కఠోరంగా, అరుస్తూ, నా ఏకాంతాన్ని, అందులోని నిశ్శబ్ధాన్ని చీల్చాయి.

వాటికూ్కడా బాగా అలవాటయింది రోజూ ఇక్కడ మేత మెయ్యడం. రాజ్యంపోయి నిన్నటికి పదిహేను రోజులు మాత్రమేగా. ఈ పదిహేను రోజులు వాటికి బోల్డు తిండానికి, మరి ఈ రోజున ఖాళీగా ఉన్న నూతిపళ్ళెం చూసి అరుస్తోంది. ఆ కాకా శబ్దాన్ని భరించ లేకపోయాను.

“ఒరే! సత్తెన్నారాయణా, గమ్మున నాలుగు గింజలెయ్యి. దాని అరుపులు విన్లేకపోతున్నాను.”

'అయ్!' అంటూ సత్యనారాయణ నాకు తోడుగా నాతో ఉండే పాలేరు లోపలి కెళ్ళాడు.

“రాజ్యం! అన్నీ శాస్త్రోక్తంగా నిర్వర్తించాను. నీ ఆత్మశాంతికోసం అన్ని దానాలు చేసాను. ఇంటికొచ్చిన వాళ్ళకి బట్టలు పెట్టాను. నీ యాత్ర సుగమం కావడానికి అన్ని చేసాను. ఆవుని దూడతోసహా మన కుంటి అప్పన్నశాస్త్రిగారికి దానమిచ్చాను. నీకోపం వస్తుందేమో అని అనిపించింది. కానీ ఈ చుట్టుపక్కల ఊళ్ళకెళ్ళి కార్యాలు చేయించలేక, ఉన్న ఊళ్ళో సరిఅయిన మార్గములేక, అవస్థ పడుతూంటే భూదానం, గోదానం రెండూ మానవతాదృష్టితో ఆయనకే యిచ్చాను. నీకు పుణ్యలోకం రావాలనే. కోపం తెచ్చుకోకు.”

రాజ్యలక్ష్మి అలాగే చిరునవ్వుతో వింటోంది.

“నలభయ్యేళ్ళు కలిసి ఉన్నాం. కానీ, మానసికంగా మొదటిసారిగా విడిపోయింది

మా అమ్మ మన వెంకటేష్ పుట్టినప్పుడుకదా వచ్చింది అప్పుడు. నీ మీద ప్రేమకొద్దీ నేను నిన్ను పుట్టింటికి పంపలేదు. నేనేమో అమలాపురం ట్రాన్స్‌ఫర్ చేయించుకుని అమ్మ దగ్గరికొచ్చాను. అమ్మ ఎన్నిసపర్యలు చేసేదో నీకు గుర్తులేదు. నిన్ను బాబుని చూసుకుంటూ, యిటు వంటింట్లో పని చేసుకుంటూ ఉత్సాహంగా, ఏళ్ళు తగ్గిపోయినంతగా అటూయిటూ తిరిగేది. నువ్వు గుర్తు తెచ్చుకోవు. తెచ్చుకుంటే నీ పంతం ఎలా సాగుతుంది? అంతేకదా!"

రాజ్యం చెరగని నవ్వుతో నా మాటలన్నీ వింటోంది.

"కాని,... ఒక్కటి రాజ్యం... నన్నెప్పుడూ బాధ పెడ్తూంటుంది, అదే నిన్నూ...అమ్మని...సమానంగా సంతోషపెట్టలేకపోయానని యిద్దర్నీ సంతోషపెట్టడానికి ప్రయత్నించాను. కానీ సఫలీకృతుణ్ణి కాలేకపోయాను.

"నాన్నగారి సంగతి నీకు తెలీని దేంవుంది? అయినో సన్యాసి, మహర్షి. ఇప్పుడు నేనాయనలాగా ఉండడానికి ప్రయత్నిస్తున్నాను. యిహంతో సంబంధం లేకుండా, అరుగుమీద కూచుని, గ్రామంలోని వాళ్ళకి పురాణం చెప్తుండేవారు. పిల్లలకి మంత్రపుష్పం, సహస్రనామాలు చెప్తూ కూచునేవారు. పిలుపొచ్చినప్పుడు లోపలికి వెళ్ళేవారు. పాపం! అమ్మే నన్ను పెంచడానికి చాలా కష్టపడాల్సి వచ్చేది."

"నాకు అంచెలంచెలుగా ప్రమోషన్‌లు వస్తూంటే చాలా సంతోష పడేది. రాజ్యలక్ష్మి గుళ్ళో అమ్మవారికి నీతోని చీర, జాకెట్టు శుక్రువారం నాడు యిప్పించేది. అందరి దగ్గరా గొప్పగా చెప్పేది. పరోక్షంగా నిన్నే పొగుడుతున్నానని ఆమెకి తెలీలేదు. రాజ్యం, ఏమాటకామాటే, నువ్వు నా వెనక్కాలే ప్రోత్సహించకపోతే అలాగే ఉండేవాణ్ణి. నాతోని డిపార్ట్‌మెంటల్ పరీక్షలు కట్టించావు. ప్రమోషన్ల మీద ప్రమోషన్లు నీ మూలంగానే వచ్చాయి. కానీ, నేనేం పోగొట్టుకున్నానో నీకు తెలీదు. నీకక్కర్లేదు కూడా. మంచి స్నేహితుల్ని. వాళ్ళ విలువల్ని. నా సొంత అభిప్రాయాల్ని.

"ప్రతీసారి నా దగ్గర్నుంచి ఆఫీసు విషయాలన్నీ సేకరించేదానివి. ఆ తర్వాత ఏదో ఓ మార్పు జరిగేది. పైగా నువ్వే అనుక్కుంటుంటావు. గుర్రాన్ని చెరువు దగ్గరికి తీసుకెళ్ళి నీళ్ళు తాగించలేకపోతే, ఆ గుర్రానికి దాహం వేసేలా చెయ్యాలని...

"రాజ్యం! నువ్వు చదివింది పదోక్లాసే. అదికూడా ఫెయిలు. నీ కోడలులా పెద్దచదువే చదివి ఉంటే అందలేనంత పొజిషన్‌లో ఉండేదానివి.'

నిశ్చలంగా వింటోంది.

సత్యనారాయణ కాఫీని, మెరకవీధిలో కొత్తగా పెట్టిన రాజారాం మెస్సునుంచి తెచ్చాడు.

"కాఫీ పుచ్చుకుంటారేటీ బావూ!"

"తర్వాత తాగుదామనుకుంటున్నాను. అక్కడ పెట్టేసి నువ్వెళ్ళు."

"ఒద్దులెండి బావు. తర్వాత మీరేం తాగరు. మీ సంగతి నేను చూడకపోతే ఎలాగండి ఆయ్. ఓ చిన్ని మిళ్ళి గిన్నెడు పుచ్చుకోండి."

బలవంతంగా కాఫీ తాగించి వెళ్ళిపోయాడు.

అద్దాల బరువుకి కళ్ళజోడు అస్తమానం జారిపోతూంటుంది. జారిన కళ్ళజోడుని తుడుచుకుని మళ్ళా పెట్టుకున్నాను.

ఎంత ఆలోచిస్తున్నాను రాజ్యం గురించి? ఎలా మాట్లాడేది? ఒక్కొక్క మాట కాస్టిక్. ఒక్కోసారి అమ్మకళ్ళు తుడుచుకునేది. నోరులేని మంచి కొడుకుగా పేరుంది. అలాగే నోరులేని మొగుడుగా పేరు చాలా తొందరగా వచ్చేసింది.

రోజులు గడుస్తున్న కొద్ది నాకు తెలీకుండానే చాలా మార్పులు నాలో వచ్చాయి. అందులో స్వేచ్ఛ, ఆనందం. ముఖ్యం పర్సనల్ స్పేస్.

ఒక్కటి మటుక్కు నిజం. మా అమ్మచెయ్యలేనిది రాజ్యం చేసింది.

"ఒరే! విస్సన్నా! నువ్వు ఆ పరీక్ష ప్యాసయ్యావనుక్కో ప్రమోషన్ వస్తుంది కదా. ఆ పళంగా నిన్నెక్కడికో పంపిస్తారు. అప్పుడు నువ్వు అదేదో ఊరెళ్తే నీకు వణ్ణం అదీ ఎలారా! నీ కూడా నే వచ్చాననుక్కో ఇక్కడ నాన్నగారికి బోయినం." నాకు మరో ఆలోచన రాలేదు. చోటులేదు కూడా.

కానీ, రాజ్యం...బలవంతంగా పరీక్షలకి కట్టించింది చచ్చినట్టు ఈ ఊరు ఆఊరు వెళ్ళాను.

రాజ్యం ఈ నాటికి ఆశ్చర్యంగానే ఉంటుంది నాకు తగ్గ అమ్మాయి నువ్వేనని అమ్మకి ఎలా తెలుసు? అమ్మకి పెద్దగా తెలీకపోయినా మేనమామ పట్టుపట్టి జాతకం చూపించి మరీ పెళ్ళి చేసారు.

"నా జాతకం చూసినవాళ్ళు మంచి భర్త లభిస్తాడని అన్నారు. నేననుకున్నాను నా చేయి పట్టుకుని నన్ను నడిపిస్తూ గురువుగా మార్గదర్శకుడిగా ఉండే భర్త వస్తాడని.

ప్ప్! పోర్షన్‌లు తారుమారయ్యాయి. మీకేం తెలీదు. అన్నీ చెప్పాల్సి వస్తోంది." అంటూ ఎప్పుడూ దెప్పిపొడుస్తూండే దానివి.

నిజమే నా పాత్ర తారుమారయింది. నా చిన్ని ప్రపంచంలో నాకున్న దానితో సంతృప్తిగా హాయిగా నువ్వుండనీయలేదు.

ఏంబిషన్. సీజర్ యాంబిషన్. అత్యాశ. నా అపజయం నువ్వు భరించలేవు. తక్కువ మార్కులు రాకూడదు. ఎదిరించలేదు. నువ్వు చెప్పినట్టే చేసాను. ఎదిగాను. ఎంతో ఎదిగాను. అమ్మకిందికి జారిపోయిందని మనందరికీ తెలుసు. అమ్మ నిస్సహాయురాలు. పైకి ఎదిగాను.

కానీ, రాజ్యం; మన ఈ నలభైఏళ్ళ సుదీర్ఘ ప్రయాణంలో ఓడిపోలేదా!

"ఎక్కడ ఓడిపోయాం? చెప్పండి. ఒక్క ఉదాహరణ యివ్వండి. ఎక్కడ విజయం సాధించలేదు?

"నా ఓటమి నీకు ఓటమిలా అనిపించలేదులే రాజ్యం. నాన్నగారు పోయాకా ప్రతీదానం దగ్గర గొడవ పెట్టావు. నాకు అన్నీ గుర్తున్నాయి. ప్రతీమాసికానికి డబ్బుదండగ అంటూ పోట్లాడేదానివి. పోయినవాళ్ళ పేర్లు చెప్పడం ఈ బ్రాహ్మలు పబ్బం గడుపుకోడం. నాకేం నమ్మకం లేదు. అన్నీ మూఢాచారాలు మూఢనమ్మకాలు. నీ మాట భరించలేక అమ్మ మావయ్య దగ్గరికి కూచిమంచివారి అగ్రహారం వెళ్ళిపోయింది. అంతకన్నా నన్ను వదిలేసింది అనడం న్యాయంగా ఉంటుంది. ఇంతకన్నా పెద్ద ఓటమి ఇంకేం కావాలి?"

రాజ్యలక్ష్మి తిరిగి ఫోటోలోకి దూరిపోయింది.

"నీకు తెలుసు అమ్మ ఆశ, భవిష్యత్తు, ఆనందం అన్నీ నేనే. అలాంటిది ఆఖరి క్షణాన నేను పక్కనుండ లేకపోయాను. ఇది ఓటమికాదా! పై లోకంలో అమ్మ నాకోం ఎదురుచూస్తుందని నాకు తెలుసు. కానీ, నా కన్నా ముందు నువ్వే వెళ్ళిపోయావు. కాబట్టి, ఆమె కనపడితే ఏం చెప్తావ్?"

రాజ్యలక్ష్మి ముందుకొచ్చింది.

"ఇందులో ఏంవుందని అంత బాధపడిపోతున్నారు. ఎప్పటి లాగానే చూసుకుంటాను. ఇదో పెద్ద ఓటమి అనుక్కుంటారేం? వెర్రి"

బాత్రూం వెళ్ళాలి.

"ఒరేయ్! ఎక్కడున్నావ్? సత్తెన్నారాయణా!"అంటూ లేవబోయాను. కానీ సాధ్యంకాలేదు.

"ఆయ్!"అంటూ చెంగున వాలి, నా బుజాన్ని, చేతిని మెల్లగా పట్టుకుని, లేవతీసాడు. చేతి కఱ్ఱ తీసుకున్నాను.

"ఏరా! పేపరిచ్చాడా!

"ఆయ్! లేదండి."

అరుగు మీద కుర్చీలో కూచున్నాను.

సంతోషం, ఆనందం మర్చిపోయిన రోజులు ముందుకొచ్చాయి.

నాకు ఒక్కగా నొక్క కొడుకు. వాడితో కూచునే టైము లేకపోయింది. గడిపిన క్షణాలు లేవు. వాడితో కలిసి పంచుకున్న ఘడియలు లేవు.

ఆరో క్లాసు వరకు మా దగ్గరే ఉన్నాడు. ఏడో తరగతి నుండి హాస్టల్లో పెట్టేసింది రాజ్యం. మా యిద్దరి మధ్యా తండ్రి కొడుకుల బంధంలాటిది ఏదైనా ఉందంటావా రాజ్యం! రాజ్యం! నీకు తెలీకుండానే మా యిద్దరి మధ్యా దూరం చాలా పెంచావ్? ఎందుకలా చేసావ్? యిలా ఎందుకయింది? నువ్వు కాదా కారణం?

"నేనా!" అంటూ రాజ్యలక్ష్మి నేనుకూచున్న కుర్చీ పక్కనే ఉన్న స్థంబం చాటున నుంచుంది.

"నేనా! మీకు పని ఒత్తిడి ఎలాగూ ఆఫీసులో ఉంటుంది. యింక వీడి చదువు కూడా మీ మీద ఎందుకని హాస్టల్లో పెట్టాం. ఏం అంత బాధపడ్తారు? నేను సాయంత్రాలు గడపలేదా! ఒక్కదాన్ని ఉండలేదా! మీరు తప్పుచేసారని, దానికి కారణం నేనే అని యిదవక్కర్లేదు. మీరు అంత సంపాదించారు కాబట్టే వేరే ఊళ్ళోపెట్టి చదివించాము. డాక్టరయ్యాడు. ముందు ఇంగ్లాండు పంపించాము. ఆ తర్వాత అమెరికా పంపించాము. డబ్బు లేకపోతే యివన్ని చెయ్యగలమా! చెప్పండి. మీరే ఆలోచించండి."

"అంతేనా! అదొక్కటే అనుక్కున్నావా! యు ఎస్ కి వెళ్ళాడు. ఓ విధంగా మన బంధం వదులు చేసుకుని వెళ్ళాడు. దూరం వెళ్ళిపోయాడు. వాణ్ణినేనేం తప్పు పట్టగలను? తప్పునాది. వాడికి చదువు, డబ్బు కాకుండా మరేదైనా యిచ్చానా! నాడు మన భవిష్యత్తుకి

ఓ పెట్టుబడి. అంతకు మించి మరేం లేదు. మరేంకాదు. తండ్రి ఏంవిచ్చాడో కొడుకు అదే యివ్వాలని అనుకుంటాడు. నేను వాడి డాక్టరు చదువుకి కొన్ని లక్షలు ఖర్చుపెట్టాను. డబ్బే యివ్వాలని అనుకుంటాడు. నా దగ్గర్నుంచి ప్రేమ, అభిమానం, ఆప్యాయత వాడికి రాలేదు కాబట్టి, నేను వాడి అభిమానం ఆశించడం తప్పుకాదా!"

"వాడి హృదయంలో మనకి చోటుందని నువ్వనుకోకు. నీకో విషయం చెప్తాను. షాక్ తింటావు. నేను భూతద్దంలోంచి చూడడం లేదు. జరిగింది చెప్తున్నాను. నువ్వు పోయాకా, నేను చేసిన మొదటి పని న్యూయార్క్‌కి ఫోన్. వాడేంవన్నాడో తెలుసా! 'చాలా బిజీగా ఉన్నాను. రాలేను. తర్వాత వీలుపడినప్పుడు వస్తాను'. మొదటిసారి వాడికి నచ్చేవిధంగా మాట్లాడాను. 'ఏంవన్నానో తెలుసా! సరే, నీ యిష్టం. ఈ పళంగా నువ్వు యిక్కడికి వచ్చినా ఏం చెయ్యగలవు? మీ అమ్మని తిరిగి వెనక్కి తీసుకురానేరవుకదా! పోయిన వాళ్ళకోసం మన అర్జంటు పనులు వాయిదా వేసుకోలేము కదా! నువ్వు తరవాతే రా!'అని అన్నాను.

నాకు తెలుసు నా మాటలు నీకు నచ్చవని. వాడు అన్న దానికి అపోజ్ చెయ్యడం మనిద్దరికీ మొదట్నించి అలవాటు కదా! మొదటిసారి నీ మాట జవదాటానుకదా!"

చూపు మసకబారింది. కళ్ళు రెండూ నీళ్ళతో నిండి ఉన్నాయి. తలెత్తి స్థంబం వెనక్కాల రాజ్యలక్ష్మి ఉందేమో చూసాను. కనపళ్ళేదు. ఫోటోలోకి దూరిపోయిందేమో!

"పేపరు లేటయిందండి" నా జవాబుకోసం చూడకుండా పేపరు నా ఒళ్ళోఉంచి సైకిల్ తీసుకుని పరిగెత్తాడు.

'ఇవాల్టికి పదహారు రోజులు' నిట్టూరుస్తూ రోజులు లెక్కపెడ్తూ పేపరు అందుకున్నాను.